క్లుప్తంగా

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

చిన్నకోదూరు(సిద్దిపేట): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల కృషివల్లే ప్రాజెక్టులు పూర్తయ్యాయని బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు గురువారం మండల పరిధిలోని మెట్‌పల్లి వద్ద వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రాజెక్టులు కట్టకుంటే ఇప్పుడు సాగు నీరు వచ్చేదా? అని ప్రశ్నించారు. సాగునీరు అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఉదారత



మాట్లాడుతున్న ఎంఈఓ రంగనాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మసిరెడ్డితండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనిల్, రజిత ఉదారతను చాటుకున్నారు. విద్యార్థులకు డిజిటల్ బోధనలో భాగంగా వారి సొంత ఖర్చుతో పాఠశాలలో టీవీ ఏర్పాటు చేశారు. దానిని ఎంఈఓ రంగనాయక్ గురువారం ప్రారంభించి ఆ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, సీఆర్‌పీ లక్ష్మణ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న వెంకటయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎర్త్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి విద్య, సాంస్కృతిక, క్రీడాపోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకర్షించాయి. వెంకటయ్య, న్యాయమూర్తి చందన, ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, ఫౌండేషన్ డైరెక్టర్ రాజు, వెన్నెల, రాజు, ఆంజనేయులు, నిహారిక, రాకేశ్, ప్రశాంత్, రత్నం, ప్రవీణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట



ఎల్‌ఓసీ అందిస్తున్న కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకునూరుకి చెందిన బాలవ్వ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.4లక్షల ఎల్‌ఓసీని గురువారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఆగంరెడ్డి, నానిబాబు, రాజుగౌడ్, నరేశ్, రాజేశ్వరి, సంపత్ తదితరులున్నారు.

ఘనంగా చేతిరాత దినోత్సవం

దుబ్బాకటౌన్: అందమైన చేతిరాతతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని హెచ్‌ఎం సాదత్ అలీ అన్నారు. ధర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా జాతీయ చేతిరాత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చేతిరాత ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడతూ విద్యార్థులు చదువుతోపాటు చేతిరాతపై కూడా దృష్టి సారించాలన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. బస్టాండ్ చౌరస్తాలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబరు ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాజిద్‌పూరకు చెందిన ఎండీ నసీర్‌ను పోలీసులు ఆపారు. వాహనానికి చెందిన పత్రాల గురించి అడగగా దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- సుందరంగా ముస్తాబైన శంభు ఆలయం
- శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉత్సవాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు



విద్యుత్ కాంతుల వెలుగులో దేవాలయం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడలో 12వ శతాబ్దంలో వెలిసిన స్వయంభు శంభు దేవాలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం శోభాయమానంగా ముస్తాబైంది. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన ఆలయాల్లో ఈ శంభు ఆలయం ఒకటి. కనులపండువగా నిర్వహించుకునే ఈ బ్రహ్మోత్సవాలలో హైదరాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట నుంచి అతిథులను ఆహ్వానించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేకంగా వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు తరలిరానున్న భక్తులు మొక్కులు తీర్చుకొనేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ట్రస్టు చైర్మన్ మంచాల శ్రీనివాస్ తెలిపారు.

ఆలయ చరిత్ర

దుద్దెడ స్వయంభు శంభు దేవాలయం చక్కటి శిల్పకళా సౌందర్యంతో చూపరులను ఆకట్టుకుంటుంది. కాకతీయ చక్రవర్తయిన ప్రతాపరుద్రుడి సామంత రాజైన నాచిరెడ్డి కుమారుడు పానుగల్లు పురాధీశుడైన మాధవరెడ్డి వేయించిన శిలాశాసనం ఆలయంలో ఉంది. తెలుగు, సంస్కృతం మిళితమైన లిపిలో అది ఉంది. 1296 సమయంలో దుర్ముఖి నామ సంవత్సర శ్రావణశుద్ధ పౌర్ణమి సోమవారంనాడు వేయించినట్లుగా తెలుస్తోంది. 78 అడుగుల చతురస్త్ర వైశాల్యంగల ప్రదేశంలో ఈ ఆలయ నిర్మాణం భారీ శిలలతో నిర్మితమైంది. స్వయంభు లింగం, పార్వతీదేవి విగ్రహం, వీరభద్ర ఆలయం, జలలింగం, సంతాన నాగేంద్రుడు, పార్శ్వనాథుడు విగ్రహాలు నేటికీ చూడముచ్చగా దర్శనమిస్తున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా రథోత్సవం

ఆలయ ఆవరణలో 300అడుగుల వైశాల్యంతో కోనేరు నిర్మించారు. తెప్పోత్సవాలు నిర్వహించేందుకు అనువుగా మెట్లను ఏర్పాటు చేశారు. కోనేరు లోపల పడమర, ఉత్తర, దక్షిణం వైపు సొరంగ మార్గాలున్నాయి. ఆలయంలో యేటా పుష్య బహుళ దశమి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా జరుపుతారు. ఇందులో భాగంగా నిర్వహించే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ. ఐదంతస్తుల రథంపై శివుడి విగ్రహాన్ని ఉంచి పురవీధుల గుండా ప్రజల దర్శనార్థం ఊరేగిస్తారు.

రోజువారీ కార్యక్రమాలు

శుక్రవారం ఉదయం 9:45ని.లకు వినాయక పూజతో ఉత్సవాలు ప్రారంభమై సాయంత్రం 4 గంటల నుంచి శకటోత్సవం(బండ్లు తిరుగుట), 25 ఉదయం 10 నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు లక్ష్మీగణపతి హోమం, రాత్రి 7:53ని.లకు దిష్టికుంబాలు, ఆలయ ప్రదక్షిణలు, 26 ఉదయం 9గంటల నుంచి స్వామి వారి ఎదురుకోలు, 11:45ని.లకు శుభ అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరుగుతుంది.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన శంభు ఆలయం



దేవాతామూర్తుల మూలవిరాట్‌లు

అనంతరం అన్నదాన వితరణ, రాత్రి 8 గంటలకు కల్యాణ మూర్తుల ఉత్సవ విగ్రహాల రథోత్సవం, ఊరేగింపు నిర్వహించనున్నట్లు స్వయంభు శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్టు చైర్మన్ మంచాల శ్రీనివాస్ తెలిపారు.

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, పార్టీల కార్యాలయాలలో నేతాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి యువతకు ఎంతో ఆదర్శమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.



కోహెడ(హుస్నాబాద్): నేతాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వంశీధర్‌రెడ్డి తదితరులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



చేర్యాల(సిద్దిపేట): నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న నరసింహులు

జనగామ: స్థానిక పోలీసు కంట్రోల్ రూమ్ ఆవరణలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్య, మానవ వనరులు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ జనగామ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి రామిని హరీశ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో మెంబర్, తెలంగాణ మాజీ అధ్యక్షుడు బక్కని నరసింహులు, విశిష్ట అతిథిగా భువనగిరి పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు కుందారపు కృష్ణాచారి పాల్గొని సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు కేక్‌కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య, నాయకులు గ్రావణబోయిన బాల్‌నర్సయ్య, సురుగు సతీశ్‌గౌడ్, గుగులోత్ కనకరాజు, పరకాల శ్రీనివాస్, కడారు ప్రవీణ్, వృకోదర్‌రెడ్డి, నీలం స్వామి, తాళ్లపెల్లి ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అనర్హులకే ఇస్తున్నారు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం
- మూడోరోజు గ్రామసభల్లో రసాభాస
- అధికారులను నిలదీసిన గ్రామస్తులు



ప్రజలతో కలిసి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎంపీడీఓ యాదగిరి అధ్యక్షతన జగదేవ్‌పూర్‌లో గురువారం గ్రామసభ నిర్వహించారు. నాలుగు పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. ఉపాధి హామీ కూలీలు తమకు ఆత్మీయభరోసా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇళ్లకు 14 వందల మంది దరఖాస్తులు చేసుకుంటే కొంతమందికే ఇళ్లు వచ్చాయంటూ అధికారులను నిలదీశారు. అనర్హులకే ఎక్కువ అవకాశం ఇచ్చారని బీఆర్‌ఎస్ నేతలు అనడంతో కాంగ్రెస్ నేతలు కలుగజేసుకోవడంతో ఆ రెండు వర్గాల మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు.

సంయమనం పాటించాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న గోపీకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోఅర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ చెప్పారు. సిద్దిపేటలోని వివిధ వార్డులలో చేపట్టిన సభలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎలాంటి పొరపాట్లు ఉండవని, దరఖాస్తుదారులు సమన్వయం పాటించాలని సూచించారు. డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పూర్ణిమ, కలీముద్దీన్, బుచ్చిరెడ్డి, మందపాండు, వహాబ్, వహీద్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): జాబితాలో ఎక్కువగా అనర్హులకు పేర్లే వచ్చాయని పలు గ్రామాల ప్రజలు అధికారులను నిలదీశారు. మండలంలోని సలాఖపూర్, రేబర్తి, గాగ్గిల్లాపూర్ గ్రామాల్లో సభలు నిర్వహించారు. సలాఖపూర్‌లో అనర్హుల పేర్లు మాత్రమే వచ్చాయని గ్రామస్తులు తహసీల్దార్ రహీంను ప్రశ్నించారు. తహసీల్దార్ సరైన సమాధానం చెప్పకుండా సభను ముగించి వెళ్లిపోయారు.

అర్హులందరికీ అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. మండలంలోని ఇటిక్యాలలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయడం గ్రామప్రజలకే సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికే పథకాలను అందిస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ అయూబ్, దాసు, ఏఓ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారం, అల్వాలలో అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో రుణమాఫీ కాని రైతులు వాగ్వాదానికి దిగారు. గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్, గ్యాస్ సబ్సిడీలు రావడంలేదని వాపోయారు. దీంతో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి జోక్యం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించాలనే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాలల్లో ఆర్‌ఐ రాజ్‌కుమార్, ఏఈఓ రేఖ, పంచాయతీ కార్యదర్శి తులసి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

సిద్దిపేటరూరల్: సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్, పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది, బంజేరుపల్లిలో ఎంపీడీఓల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గుర్రాలగొందిలో బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు ఆంజనేయులు, హరీశ్ తదితర నాయకులు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు రాములు, మురళీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందిస్తాం: ఎంపీడీఓ

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస వర్మ అన్నారు. మండలంలోని మర్రిముచ్చాలలో నిర్వహించిన గ్రామసభలో అర్హుల జాబితా విడుదల చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీఓ సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజమణి, కాంగ్రెస్ నాయకులు నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ



మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తదితరులు

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ చెప్పారు. 23, 24, 31 వార్డుల్లో ఆయన పాల్గొన్నారు. భారత్‌నగర్ వార్డుల్లో చైర్ పర్సన్ మంజులతో కలిసి సభకు హాజరయ్యారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సభల్లో వైస్ చైర్మన్ కనకరాజు, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు అరవింద్, లక్ష్మణ్, ప్రవీణ్, నాగరాజురెడ్డి, మల్లికార్జున్, వజీర్, బీఆర్‌ఎస్ నాయకులు ఈర్షద్, కాంగ్రెస్ నాయకులు వహీద్ ఖాన్ పాల్గొన్నారు.

అర్హులకు అందని పథకాలు

గజ్వేల్‌రూరల్: పథకాలను అర్హులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే వర్తింపజేయడం సరికాదని బీజేపీ నాయకులు మండిపడ్డారు. సభల్లో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ గజ్వేల్‌లో ఎంపీడీఓ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలశాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ సభలలో స్థానిక ఎంపీ రఘునందన్‌రావు ఫొటో ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ మహేశ్, నాయకులు శ్రీనివాస్, స్వామి, కుమార్, గణపతి, నర్సింహారెడ్డి, సత్యం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకోవడం సబబు కాదు

చేర్యాల(సిద్దిపేట): అర్హుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను బీఆర్‌ఎస్‌నాయకులు అడ్డుకోవడం సబబుకాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన స్వగ్రామమైన మద్దూరు మండలం నర్సాయపల్లిలో జరిగిన గ్రామసభకు హాజరైన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డు పడడం సిగ్గుచేటన్నారు. నాయకులు రవి, శ్రీకాంత్, ఆగంరెడ్డి, రాకేశ్ కృష్ణ, యాదగిరి, లింగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల పేరుతో కాలయాపన

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు, గ్రామసభల పేరుతో కాలయాపన చేస్తుందని బీఆర్‌ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. కూచనపెల్లిలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తులను పరిశీలించారు. ఆయన వెంట భాస్కర్, సంజీవ తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి గ్రామసభలో రచ్చ రచ్చ...



గౌరవెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గౌరవెల్లిలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ అనంతరెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ రచ్చగా మారింది. అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ పలువురు అధికారులను నిలదీశారు. అర్హత ఉన్నా ఎందుకు తమపేర్లు చేర్చలేదని గ్రామానికి చెందిన నందారపు శ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిర్మల, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాటించని ప్రొటోకాల్



బెజుగామలో గ్రామస్తుల వాగ్వాదం

గజ్వేల్‌రూరల్: గ్రామసభల నిర్వహణలో ప్రొటోకాల్ పాటించడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలను వర్తింపజేస్తున్నారంటూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు మండిపడ్డారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11, 12, 13, 14, 15 వార్డులలో, మండల పరిధిలోని బెజుగామ, దిలాల్‌పూర్, శేరుపల్లి, అనంతరావుపల్లి, గిరిపల్లి, కోమటిబండ, పిడిచెడ్ గ్రామాల్లో నఅధికారులు గ్రామసభలు నిర్వహించారు. బెజుగామలో జరిగిన సభలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఇన్‌చార్జి అధికారి, తహసీల్దార్‌ను ప్రశ్నించగా రాష్ట్రమంతా ఇదే విధంగా కొనసాగుతుందనడంతో అనంతరావుపల్లి గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఆత్మీయ భరోసా అందించాలి

గజ్వేల్‌రూరల్: అర్హులైన వారందరికీ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని ఆర్‌టీఐ యాక్ట్ జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(సింగారం)లో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులకు ఉపాధి హామీ పనులను కల్పించి ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు.

కాంగ్రెస్ పూర్తిగా విఫలం

సిద్దిపేటఅర్బన్: హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య ఆరోపించారు. మిట్టపల్లిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనర్హులను జాబితాలో చేర్చడం వల్ల అర్హులకు పథకాలు అందకుండా పోతాయన్నారు.

పోలీసు పహారాలో గ్రామసభలా?

- కార్యకర్తలకే పథకాలను అందజేసే కుట్ర
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ కార్యకర్తలకే వర్తింపజేస్తున్నారని, ఇక గ్రామసభలు నిర్వహించడం ఎందుకని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలం కావడం వల్ల జనం నుంచి నిరసన వెల్లువెత్తుతోందని, దాన్ని తట్టుకోలేక పోలీసు పహారాలో సభలు నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తేనే పథకాలు వర్తింపజేస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ గ్రామసభలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పథకాలు అర్హులందరికీ దక్కేంతవరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ నాయకులు మధు, నవాజ్‌మీరా, కౌన్సిలర్లు మెట్టయ్య, శ్రీనివాస్, శ్యామల, రజిత, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., L.L.B.
Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony,
JANGAON, Dist: Jangaon, Cell: 9848430926

యువతతోనే దేశాభివృద్ధి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో 'యంగ్ ఇండియా కే బోల్ సీజన్–5' కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ విజేతకు రూ.40వేలు, ద్వితీయ విజేతకు రూ.25వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, వహాబ్, పవన్, రామకృష్ణ, రాజిరెడ్డి, వనజ, కరుణాకర్, సంతోషి, అజ్మత్, సాయి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

చిన్నకోదూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చంద్లాపూర్‌లో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన దేవయ్య రోజూ మాదిరిగానే తన పొలం వద్ద దూడను కట్టేశాడు. గురువారం ఉదయం వెళ్లి చూస్తే దూడ మృతి చెంది ఉంది. దానిని హైనానే చంపినట్లు రైతు వాపోయాడు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.17,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

క్రీడాదుస్తులు అందజేత

గజ్వేల్‌రూరల్: దాతర్‌పల్లిలోగల ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు స్థానిక ఉపాధ్యాయుడు కొత్తపల్లి ప్రభాకర్ తన తండ్రి భిక్షపతి, కొడుకు అంశుల్‌ల జ్ఞాపకార్థం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చేతుల మీదుగా 30మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను అందజేశారు. గురువారా జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్

సిద్దిపేటజోన్: స్థానిక క్రికెట్ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ కప్ టోర్నీ రౌండ్ 2 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆయా మ్యాచ్‌లలో ప్రతిభ చూపిన క్రీడాకారులను గురువారం నిర్వాహకులు మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ప్రతినిధులు సతీశ్, శివ, నరేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990